

3. రామడుగు శివరామ దీక్షితులు (1690 - 1791)

భారతీయ సనాతనధర్మం కుదురులో వివిధకాలాలలో అనేకమతాలు పుట్టినవి; అనేకయోగశాఖలు ప్రవర్తిల్లినవి. వీటిలో కొన్నింటికి ఆంధ్రులు ప్రవర్తకులు కావటం ఆంధ్రజాతికి గర్వకారణం. తమిళదేశం శ్రీ పెరుంబుదూరులో పుట్టి విశిష్టాద్వైత మత స్థాపనా చార్యులైన భగవద్రామానుజులు (1019-1139) ఆంధ్రులు. కాకరవాడ వెలనాటి బ్రాహ్మణుల యింటపుట్టి ఉత్తరభారతదేశంలో పుష్టిమార్గమనే శుద్ధాద్వైతమతం ప్రవర్తిల్లజేసిన వల్లభాచార్యులు (1473-1531) ఆంధ్రులు. కుంభకోణం నియోగులింట జన్మించి భృక్తరహిత తారకరాజయోగం పేరుతో ఒక క్రొత్త యోగమార్గాన్ని నిర్దేశించిన మాస్టర్ సి.వి.వి. (1868- 1922) ఆంధ్రులు. ఆంధ్రదేశంలోనే కాక, భారతదేశం 11 రాష్ట్రాల్లోను విదేశాల్లోను అచలమతం అచలయోగం పేరుతో ఒక క్రొత్త సంప్రదాయాన్ని ప్రవర్తింప చేసిన నల్లగొండజిల్లా నారాయణపేటవాసి రామడుగు శివరామదీక్షితు లాంధ్రులు. హరితస గోత్రీకులైన రామడుగు నిర్మలాంబా విశ్వనాథ శాస్త్రులనే తెలగాణ్య వైదికదంపతుల కడుపుపంట రామడుగు శివరామదీక్షితులు. ఆయన శిష్యవృక్షం శాఖోపశాఖలుగా విస్తరిల్లినది. వారి శిష్యులో, వారి ప్రశిష్యులో వారి చరిత్రం వ్రాసియుంటే మనకు చాలా దక్కేది. ఆరవతరంవారైన కొప్పరపు గోపాలకృష్ణమూర్తి తమ గురువులనోట విన్న శివరామదీక్షితుల చరిత్ర రచనకు పూనుకోవటం చేత ఈ మాత్రమైనా చరిత్ర మనకు దక్కింది.

శివరామదీక్షితుల ఒక శిష్యపరంపరలో కంబాలూరి అప్పమంత్రి ఆయన శిష్యుడు పరశురామ సీతారామయ్య ఆయన శిష్యుడుకొలనుపాక వాసి భాగవతుల కృష్ణదేశికుడు "శుద్ధ నిర్గుణ తత్త్వ కందార్థ దరువులు" శా.శ. ౧౭౬౫ శుభకృత్ సంవత్సర మార్గశిరబహుళ చవితి అనగా 4-12-1843 సోమవారంనాటికి రచన పూర్తి చేసినాడు. తరానికి 35 సంవత్సరాలు లెక్కించినా (35X 4=140) శివరామ దీక్షితులు 1843-140=1703 ప్రాంతంలో ఉండవలెను. శివరామదీక్షితుల గురువు శ్రీధరులు పండరివాసి. ఆయన శా.శ. ౧౬౫౧ సౌమ్యసంవత్సర మాఘబహుళవిదియ ఆదివారం (25-1-1730) నాడు సమాధిచెందినట్లు శాసనాధార మున్నది. శ్రీధరులసమాధి పండరిపురంలోచంద్రభాగాతీరాన కుంభారీ ఘాట్‌లో ఉన్నది. శ్రీధరుల జన్మగ్రామం నాజర్‌గావ్ పండరిపురానికి 60 మైళ్ళు. సుప్రసిద్ధ మరాఠీ సాహిత్య పరిశోధకులు నా మిత్రులు ఉస్మానియా విశ్వవిద్యాలయం మరాఠీశాఖ భూతపూర్వా ధ్యక్షులు ప్రొఫెసర్ శ్రీధర కులకర్ణిగారు పండరిపురంశ్రీధరులు (1658-1729) ఆనంద సంప్రదాయానికి చెందినవారనీ, సంస్కృతంలో చాలా స్తోత్రాలు రచించినారనీ, కేశవస్వామి భాగానగర్‌కర్ గారికి (1610-1683) మిత్రులనీ చెప్పినారు. శివరామ దీక్షితులు విరోధికృత్ కార్తీకశుద్ధదశమి శనివారంనాడు తమ దేహం చాలించినారు కనుక అచలసంప్రదాయంవారు ఏటేట కార్తీకశుద్ధదశమినాడు గురువుల ఆరాధనోత్సవాలు జరుపుతుంటారు. శనివారంతో కలిసివచ్చిన విరోధికృత్ కార్తీకశుద్ధదశమి శా.శ.౧౭౧౩లోనే వచ్చినది. అది 23-11-1791 తేదికి సరిపోతుంది. శ్రీధరులు శివరామదీక్షితులకు దీక్ష ఇచ్చిన 21 దినాలకు దేహం (25-1-1730) చాలించినారు. గురువులను కలుసుకున్న నాటికి శివరామ దీక్షితుల వయస్సు 40 ఏండ్లను కుంటే ఆయన క్రీ.శ.1690 ప్రాంతంలో జన్మించియుంటారనుకోవలెను. ఈవిధంగా శివరామ దీక్షితులు (1690-1791) పూర్ణ పురుషాయుషజీవులు. ఇది దక్కనులో ఖుతుబ్షాహీల గోలకొండసామ్రాజ్యము కూలిపోయి ఆసఫ్జాహి నిజాముల ఏలుబడిలోనికి వచ్చిన కాలము. బ్రిటిషువారు ఫ్రెంచివారు ఎత్తులకు పైయెత్తులు వేయు కాలము.

శివరామదీక్షితులు నల్లగొండ జిల్లా నారాయణపురం సంస్థానవాసి. ఆయన ఇంటి పేరు గల రామడుగు ఈనాటి నల్లగొండ జిల్లా హాల్యామండలం అహల్యానదీ తీరాన ఉన్నది. అక్కడి రామాలయం రామపాదాలు సుప్రసిద్ధం. శివరామ దీక్షితులు తిరిగిన సోమపురం ఈనాటి సోమారం నేరేడుచెర్ల మండలం మూసీనదీ తీరం. అక్కడి చాళుక్యుల

కాలపు సోమేశ్వరాలయం ప్రసిద్ధమైనది. శివరామదీక్షితుల భార్యపేరు సీతామహాలక్ష్మి అని రాతు రామకృష్ణస్వామి, అన్నపూర్ణ అని వప్పంగి రామారావు వ్రాసినారు.

ఇటీవల "అచలఋషి గురుపీఠము-అనుమునిగిరి మఠము" పేరుతో నారాయణ దాసు శ్రీ రామాచార్యులు విశ్వజ్ఞ (కలువకొలను మహబూబు నగరం జిల్లా 509102) ఒక పుస్తకం ప్రకటించినారు. అందులో రామడుగు శివరామ దీక్షితులు కృష్ణా మండలం తిరువూరు జిల్లా వామకుంట్లలో రామడుగు ఇంటిపేరు గల విశ్వబ్రాహ్మణుల ఇంట క్రీ.శ.1603లో జన్మించినారనీ, పోతులూరి వీరబ్రహ్మంగారి ఆదేశం ప్రకారం క్రీ.శ.1602 సంవత్సరం సమాధి చెందిన శిష్యుడు దూదేకుల సిద్దయ్యయే శివరామ దీక్షితులుగా పుట్టినారనీ వ్రాసినారు. తమ వ్రాతలకు ప్రపంచ నిష్ప్రపంచ కందార్థము లాధారమన్నారు. ఇది విశ్వసనీయం కాదు. ఇది రామడుగు ఇంటిపేరు మూలంగా ఏర్పడిన తబ్బిబ్బు. గ్రామనామాలతో ఏర్పడే ఇంటి పేర్లు బ్రాహ్మణులకు ఇతర వర్ణాలవారికి సమానంగా ఉండటం మన అనుభవంలోని విషయం. రామడుగు అనేది గ్రామనామం. అది హరితస గోత్రీకులైన తెలగాణ్య వైదిక బ్రాహ్మణులకు ఇంటిపేరైనట్లే కృష్ణామండలం వామకుంట్ల వాసులు విశ్వబ్రాహ్మణులకు గూడ ఇంటిపేరై యుండవచ్చును. అంతమాత్రాన హరితసగోత్రీకులైన రామడుగు తెలగాణ్య వైదిక బ్రాహ్మణులున్ను సుపర్ణస గోత్రీకులైన రామడుగు విశ్వబ్రాహ్మణులున్ను ఒకరని భావించరాదు.

రామడుగు శివరామ దీక్షితుల చరి[illegible] జ్ఞానానుతర్షణాన్వేషణము పేరుతో 129 పద్యాల కావ్యంగా రచించినవారు కొప్పరపు గోపాలకృష్ణమూర్తి. శుద్ధ నిర్గుణ తత్త్వ కందార్థదరువులు రచించిన భాగవతులకృష్ణప్రభువు ప్రియశిష్యుడు ఫీల్ఖానా (హైదరాబాదు) లక్ష్మణ దేశికులు. ఆయన సోదరులు ఫీల్ఖానా శంకరప్రభువులు. లక్ష్మణదేశికులకువలె శంకరప్రభువుల శిష్యపరంపర వేరే ఉన్నది. శంకరప్రభువుల శిష్యుడు మాధవరాజు వెంకటదాసనే మాదిరాజు వెంకట అప్పారావు (1859-1935) చరిత్రం ఆంధ్రయోగులు ప్రథమభాగంలో ఉన్నది. ఈ మాధవరాజువెంకటదాసు శిష్యుడే కొప్పరపుగోపాల కృష్ణ మూర్తి. ఆయన దాదాపు 20 కృతులు రచించినారు. అందులో ఒకటి జ్ఞానానుతర్షణా న్వేషణ మనే శివరామదీక్షిత చరిత్ర. దాని ప్రకారం :-

యవనుల పరిపాలనంలో నల్లగొండ సీమలో నారాయణపురం ఒక సంస్థానం. (నారాయణపురం, రాజాపేట రెండు సంస్థానాలు ఒకే వంశానికి చెందిన రెడ్లు పరిపాలించినారు.

నారాయణపురం రెడ్లు తరువాతి కాలాన తురకల్లో కలిసిపోయినారు. రాజాపేట సంస్థానం వారు మిగిలినారు.) అక్కడ శివపూజాధురంధరుడు వేదవేదాంగపారగుడు, తర్క వ్యాకరణవేదాంత శాస్త్రవిదుడు శతక్రతుయాజి నిత్యాగ్నిహోత్రి రామడుగు శివరామ దీక్షితులనే సంపన్నగృహస్థు ఉండేవాడు. ఆయన భార్య గొప్పఇల్లాలు. ఉన్నట్లుండి ఆయనకు ఈ చదువులు సంపదలు పేరుప్రతిష్ఠలు అశాశ్వతాలనీ సంసారమనే పాము కాటుచేత బాధపడే తనకు వేదాంతమీమాంస అనే ఔషధం ఎవరిస్తారో అనే చింత పట్టుకున్నది. స్కాందపురాణోత్తరఖండంలో శివుడుచెప్పిన గుర్తులున్న గురువెక్కడ లభిస్తాడో వెదకటానికి నిశ్చయించుకున్నాడు. కుండెడు నీళ్ళు యజ్ఞకుండాల్లో పోసి నిరంతరం వెలిగే అగ్ని నార్పినాడు. ఆయన భార్య ఏడుస్తూ ఎందుకింత పని చేసినారంటే "ఈ యజ్ఞాలు అన్నదానాలు మందిర నిర్మాణాలు వేదాధ్యయనం స్వర్గసుఖా లిస్తాయే కాని మోక్షం ఇవ్వవు. నేను మోక్షార్థిని. పూర్ణానందబోధ చేసే గురువును వెదుకబోతున్నాను. గురువు కరుణిస్తే తిరిగి వచ్చి నిన్ను చూస్తాను. లేకపోతే ఇదే కడసారి చూపు" అంటూ ఇల్లు విడిచి పోయినాడు.

శివరామదీక్షితులు కాశీప్రయాగలు మొదలైన పల్లెలు పట్టణాలు తిరిగి అక్కడి దుష్టగురువుల చందం తెలుసుకొని తిరిగివస్తుండగా ఒక తోటలో పూలు కోసుకుంటున్న బ్రాహ్మణుడు తారసపడ్డాడు. ఇరువురు ఒకరిని గూర్చి మరొకరు తెలుసుకున్నారు. శివపూజకై పూలు కోసుకుంటున్న రమణయ్య సోమపురం గ్రామవాసి. శివరామదీక్షితులును తన యింటికి తోడుకపోయి ఆతిథ్యమిచ్చినాడు. శివరామయ్య సాయంకాలం వాహ్యాళికై సోమపురం వీథులు తిరుగుతుంటే కొరిగిన తల పెరిగిన గడ్డం నిండు అంగరఖాతో పొగ పీలుస్తున్న ఒక తురక ఎదురుపడ్డాడు. అతడు తుమ్మి గురుడా అన్నాడు. శివరామ దీక్షితుడా తురకను తనకు ఆ గురువును చూపుమన్నాడు. వివరాలడిగితే దీక్షితులు తాను ముముక్షువుననీ గురువుకోసం వెదకుతున్నాననీ కనుక గురుసన్నిధికి తీసుకపొండనీ కోరినాడు. ఆ తురక శివరామదీక్షితులును తమ గురువువద్దకు తీసుకపోయినాడు. శతక్రతుయాజి, బ్రాహ్మణుడు, పండితుడైన శివరామయ్యను చేరదీస్తే తనపేరుకీర్తు లినుమడిస్తాయని తురకగురువు ఆ రాత్రే ప్రథమయామంలో మంత్రోపదేశం చేస్తాననీ కావలసిన వస్తువులు సిద్ధం చేయండని శిష్యులను ఆదేశించినాడు. శివరామ దీక్షితులు రమణయ్య ఇంటికి పోయి భోజనం చేసి వచ్చినాడు.

గురువులసన్నిధిలో సురాపాత్రలు కోడిమాంసం గిన్నెలు గుమగుమలాడుతుంటే శివరామయ్య ముక్కుపుటాలు బ్రద్దలైనవి. ఆతడు కీడు శంకించి అక్కడినుండి పారిపోవటానికై విలవిల తన్నుకుంటుంటే ఏమిబాధ ఏమి రోగమని అడిగిన శిష్యులతో తనకు పరిణామశూల ఉందనీ అది వచ్చినపుడు రెండుమూడు దినాలు బాధ పెడుతుందనీ కనుక తనను రమణయ్య ఇంటివద్ద దించిరండనీ ప్రార్థించినాడు. వారట్లే చేసినారు. మరునాడుదయం శివరామయ్య ఎరుకలవాడకుపోయి పంది మాంసం కొని ఎరుకలవాని చేతనే వండించి సాయంకాలం వచ్చి తీసుకపోతానని చెప్పినాడు. తురకశిష్యుల వద్దకు పోయి పరిణామశూల తగ్గిందనీ నాటిరాత్రి మంత్రదీక్ష ఇప్పించవలసిందని కోరినాడు. వారు సరెనన్నారు. సాయంకాలం కాగానే శివరామయ్య నీరు కావి దోవతి వ్రేలికిపవిత్రం రామనామాంగుళీయకం సరిగంచు శాలువా వల్లెవాటుతో పందిమాంసపుదొప్ప చంకలో పెట్టుకొని గురువింటికి పోయి గురువుసన్నిధిలో పూజాసామగ్రిలో ఆ దొప్పను పెట్టినాడు. చాలామంచి వాసన వస్తున్నది ఇది ఏమిటంటే మీరు బంగరు పాత్రల్లో పెట్టినదేమిటని శివరామయ్య అడిగినాడు. శిష్య'లది సుర, ఇది కోడిమాంసం; ఇవి ఆరగిస్తే ముక్తికాంతా సంగమ మౌతుం'దన్నారు. శివరామయ్య తాను తెచ్చినది పందిమాంసపు కూర అనీ అది తింటే జన్మరాహిత్యమౌతుం దన్నాడు. గురువులా దొన్నె వెంటనే తొలగించుమని గద్దించినాడు. "కోపంతో తాపం కలుగుతుంది తాపం ఆపలేనివాణ్ణి గురువంటారా? పంది మాంసం మీకు చూడరానిదైతే కోడి మాంసం సుర నాకు చూడరాని"వన్నాడు శివరామయ్య. తురక గురువు "ఆర్యు లిచ్చినది నీచమైనదైనా భక్తితో తీసుకోవలె; భేదబుద్ధి పనికిరా"దంటే శివరామయ్య సురాపానం మాంసభక్షణం పాపమనీ "కోడి మాంసం పందిమాంసం రెండూ మీరూ తిని నాకు పెట్టండి అప్పుడు సమత్వం అభేదం పాటించిన వారౌతా"రంటే తురక గురువు "నీవు శిష్యరికానికి పనికి రా"వన్నాడు. శివరామయ్య "నీవు గురువుగా పనికిరా"వని లేచిపోయినాడు.

శివరామయ్య గురువులను అన్వేషిస్తూ దక్షిణాదికి పోయి కాంచీమండలం ఒక పట్టణంలో ఒక బ్రాహ్మణుని యింట అతిథిగా ఉన్నాడు. ఆ పట్నంలో దొమ్మరులు ఆడుతున్నారు. గృహస్థుతో పాటు శివరామయ్య దొమ్మరి ఆట చూడబోయినాడు. ఒక గడసాని గడ చివరిదాకా ఎక్కి నిమీలితాక్షియై లక్ష్యశుద్ధితో పెక్కుగతుల ఆడుతుంటే

శివరామయ్య మెచ్చి లక్ష్యశుద్ధితో గురువుల సేవ చేయకుండా ఈ నీచజాతికి ఇంత విద్య ఎట్లబ్బుతుంది? ఈమె గుట్టు తెలుసుకోవలెనని సాయంకాలం ఆ దొమ్మరిసాని గుడారం చేరినాడు. ఆమె నివ్వెరపోయి మీవంటి మహాత్ములు మా గుడిసెకు రావచ్చునా అంటే శివరామయ్య 'నీ నాట్యం చూచినాను. అందులో స్వీయకులవర్తిత్వం లేశమైనా లేదు. అంతా పూర్ణభావం. గుర్వంఘ్రిలక్ష్యం గోచరించింది. నేను అల్పగురువుల నెందరినో చూచినాను. నీవు అమలగురుబోధానిధివి నన్ను పూర్ణబోధయుక్తుని చేయు'మన్నాడు. ఆమె నీచజాతివారు బ్రాహ్మణుల కుపదేశించదగదంటే శివరామయ్య నీ గురువును చూపుమన్నాడు. ఆమె తమ దేశసంచారం ముగియగనే గురుసన్నిధికి తీసుకపోతానన్నది. శివరామయ్య విప్రగృహంలో తింటూ గడసాని వద్ద దివారాత్రములు సద్గ్రంథ కాలక్షేపం చేసేవాడు. సాటి బ్రాహ్మణ్యం శివరామయ్యను అవమానించి వెలివేసినారు. శివరామయ్య గడసాని గుడిసెకే పోయి ఆమె ఇచ్చే సాహిత్యం వండుకతిని దొమ్మరులకు పురాణాలు చెప్పుతూ అనేకగ్రామాలు తిరిగినాడు.

దేశసంచారం ముగియగనే గడసాని శివరామయ్యను డబ్బాకుపల్లెకు తోడుక పోయింది. అక్కడి దేవాలయం సమీపాన వటవృక్షం క్రింద రాతిగద్దెపై కూర్చున్న తాపసిని తమగురువు శ్రీధరులను శివరామయ్యకు పరిచయం చేసింది. గురువులకు శివరామయ్యను ముముక్షువుగా పరిచయం చేసింది. శ్రీధరులు "నేను నీ కోసమే శరీరం త్యజించకుండా ఎదురు చూస్తున్నాను. నీకు సాధనచతుష్టయసంపద ఉంది" అంటూ శివరామయ్యను దగ్గరికి తీసుకొని స్వస్తికారోహణలు చేసి త్రివిధతీర్థ త్రివిధప్రసాదా లనుగ్రహించి సాంఖ్య తారకామనస్కములు బోధించినారు. తరువాత త్రివిధదీక్షలు త్రిప్రసాదాలు అనుగ్రహించి హస్తమస్తకసంయోగం చేసి నాల్గు మహాకావ్యాలు వాటి శబ్దార్థాలు ద్వాదశి షోడశి పంచదశి మంత్రాలు వాటి అర్థాలు బోధించి తాము చెప్పిన తత్త్వార్థప్రచారం చేయుమని తమ పాదుక లనుగ్రహించినారు. శివరామయ్య గురుపాదుకలు నెత్తిన పెట్టుకున్నారు. శ్రీధరులు 'నేను 21వ దినాన దేహం చాలిస్తాను. నాకు ఉత్తరక్రియలు చేసి పొమ్మ'న్నారు. శివరామదీక్షితులు 21 దినాలు గురువుల సన్నిధిలోనే ఉండి వారు దేహం చాలించిన తరువాత వారికి అంత్య క్రియలు చేసి స్వదేశానికి తిరిగివచ్చి అమనస్కయోగం ప్రచారం చేసినారు.

ఈ జ్ఞానపట్టభద్రతలో నేను ఐదవవాణ్ణి అన్నారు మాధవరాజు వెంకటదాసు.

శిష్యుడు కొప్పరపు గోపాలకృష్ణమూర్తి శివరామ దీక్షితుల తరువాత గురువు లెవరంటే శివరామదీక్షితుల శిష్యుడు కంబాలూరి అప్పమంత్రి, ఆయన శిష్యుడు పరశురామ సీతారామచంద్రులు, ఆయన శిష్యుడు భాగవతుల కృష్ణయ్య, ఆయన శిష్యుడు ఫీల్ఖానా శంకరప్రభువు, ఆయన తరువాత నేను (మాధవరాజు వెంకటదాసు). నా తరువాత నీవు (కొప్పరపు గోపాలకృష్ణమూర్తి) అన్నారు. ఈ గ్రంథరచన శా.శ. ౧౮౫౭ యువ సంవత్సర పుష్యశుద్ధచవితి ఆదివారం 29-12-1935నాడు ముగిసినట్లు 129వ పద్యంలో ఉంది. గ్రంథాంతగద్య ఈవిధంగా ఉన్నది.

"ఇది శ్రీమత్కౌండిన్యసగోత్ర ఆపస్తంబసూత్ర శ్రీమద్బాలాత్రిపురసుందరీ కరుణా రస సరసకవితాప్రాప్త కొప్పరపు వంశపయఃపారావార తారాజారాప్పయామాత్యపౌత్ర గుర్వయమంత్రిపుత్ర రాజ్యలక్ష్మాంబా గర్భశుక్తిముక్తా ఫలాయమాన అచల మార్గానువర్తి గోపాలకృష్ణమూర్తి ప్రణీతంబైన జ్ఞానానుతర్షణాన్వేషణము" -

శివరామ దీక్షితులు తమ శివరామదీక్షితీయమనే బృహద్వాసిష్ఠంలో తమను గూర్చి "నేను చిన్నతనములోనే వేదములను చదివినాను. శాస్త్రములను చదివినాను. ముద్రలను చూచినాను. యోగములను సాధించినాను. మంత్రములను తెలుసుకొన్నాను. యెన్ని తెలుసుకున్న నేమి? అన్ని అడవి మార్గములుగానే యున్నవి. అప్పుడు నాకు దిగులు కలిగినది. నాకు యెవ్వరు చెప్పకపోయిరి, కాశికి వెళ్ళినాను. అందరిని చూచినాను. కొన్నిటికి సమాధానముల నడిగినాను. వారు చెప్పిన మాటలు పూర్వపక్షము చేసినాను. అందులో కొందరు నా సిద్ధాంతమును నమ్మినారు. ఎరుకను తీసివేసినాను. గోలకొండ పట్టణమునకు చేరినాను. తురకలతో వాదించినాను. అందరిది ఒక కులమేనని అన్నాను. వారు అందరు నాతో జ్ఞానులవలె సంభాషించినారు. విందుకు రావలసినదని అన్నారు. రానియెడల సమాధానము చెప్పుమని అన్నారు. మంచిది అని నేను పోయినాను. అందరము కూర్చున్నాము. సకల పదార్థములు వడ్డించినారు. ఆరగించుమని అన్నారు. నేను ఒకటి (పందిమాంసము) అడిగినాను. ఛీఛీ లేచి పొమ్మని అన్నారు. అందుకు మీకు అభిమానము ఉన్నది గనుక నేను మిమ్ములను చేరరాదని అన్నాను. అక్కడినుండి లేచి నా ఊరువచ్చినాను. నేను ఎవరితోను చేరలేదు. నాకు యెవరూ లేరు. నేను తురకలకు

ఉపదేశము చేసినాను. వారి గ్రంథములే వారికి సమాధానము అయినవి. వారి భాషలో వారి గ్రంథముల సంగతులు వారికి చెప్పినాను. ఎరుకను పందియని వారికి చెప్పినాను. గట్టిగా చెప్పినాను. వారికి నాటినది. సమాధానపడినారు. వారు పందిని తలచరు. వారికి ఆ వాసన గిట్టదు''.

ఇట్లే బ్రాహ్మణులకు ఎరుక చండాల కులమనీ, రాజులకు ఎరుక మాదిగ కులమనీ, కోమట్లకు ఎరుక గోసంగి కులమనీ శూద్రులకు ఎరుక మున్నూటి కులమనీ, తురకలకు ఎరుక పందికులమనీ పతివ్రతలకు ఎరుక పరపురుషుడని, విధవలకు ఎరుక ముండ గర్భమని ఈ విధంగా చెప్పి ఈ దోషాలు విడిచి నిర్మలులయ్యే విధానం చెప్పినాను'' అని వ్రాసుకున్నారు.

పై వ్రాతలకూ జీవితచరిత్రకారుల వ్రాతలకూ భేదం ఉంటే అది కల్పనగా భావించవచ్చు. శివరామదీక్షితుల గురువు శ్రీధరులు పండరివాసి. ఆయన పుట్టినది పండరి సమీపాన నాజర్‌గాంవ్‌లో. జీవితచరిత్ర కారులు గురుశిష్యులు మొదట కలుసు కున్నది డబ్బాకుపల్లెలో అన్నారు. ఇది తెలుగుపేరు. మహారాష్ట్రదేశంలో ఉండేపేరు కాదు. పండరి ప్రాంతాల్లో తెలుగు పొలిమేరలు కూడ లేవు. ఇది కల్పిత నామమై యుండవలె.

శివరామదీక్షితులు ప్రపంచించిన అచలమతానికి ఈనాడు ఆంధ్రదేశంలో చెప్పుకో దగిన ప్రచారప్రభావములున్నవి. అచలమనే మాట వేమన పోతులూరి వీరబ్రహ్మం ఉపయోగించినా ఆ మతానికి ఒక సిద్ధాంతం ఒక గ్రంథం మంత్రాలు ప్రసాదించినవారు రామడుగు శివరామదీక్షితులే. శివరామదీక్షితులు రచించిన గ్రంథం బృహద్వాశిష్ఠ మనబడే శివరామదీక్షితీయము. ఆ గ్రంథం 1915లో కొంత 1927లో ఇంక కొంత 1928లో మరికొంత 1988లో సంపూర్ణంగా అచ్చైనది. ప్రచురణకర్తలు (శ్రీ పూర్ణానంద రాజ యోగా శ్రమము-కర్నూలు) గ్రంథసమాలోచనంలో పండరి క్షేత్రవాసులైన శ్రీధర స్వాములవారు అచలబోధ సంస్కృతంలోను మరాఠీలోను శివరామదీక్షితులకు చేయగా వారు ఈ అఖండ జ్ఞానపరిపూర్ణభావాన్ని పండితపామరులకు తెలుగులో తేటపరచినారనీ, యోగశిక్ష సామాన్యజనులకు గృహస్థులకు సంసారులకు అసాధ్యమని కర్మభక్తిజ్ఞాన మార్గాలు సులభంగా అచలబోధసిద్ధాంతం శివరామ దీక్షితీయంగా రచించినారని ప్రశంసించినారు.

శివరామదీక్షితుల శిష్యప్రశిష్యులు వారి శాఖలు దేశమంతటా వ్యాపించినవి. ఈ శిష్యపరంపరలోనివారు కొందరు తమ తమ రచనలద్వారా బహుళ ప్రచారం చేసినారు. శివరామదీక్షితులు అచల మార్గానుయాయులకు ప్రసాదించినవి మూడు మంత్రాలు 1. ద్వాదశాక్షరి :- ఈ ఉత్త బట్టబయలు ఏమీ లేదు. 2. పంచ దశాక్షరి :- కలబోసిన శరీరము యేలాగో ఆలాగే 3. షోడశాక్షరి :- మూలము లేని గుర్తెరిగే శరీరమేమీ లేదు.

నేను 1955 సంవత్సరం పిఎచ్.డి పట్టా కోసం 'తెలుగు జానపద గేయ సాహిత్యము' అనే సిద్ధాంతగ్రంథం వ్రాసినాను. పారమార్థిక గేయాల గూర్చి వ్రాసిన ప్రకరణంలో భాగవతుల కృష్ణప్రభువు రచించిన శుద్ధనిర్గుణకందార్థదరువులను సమీక్షించినాను. నాకున్న మిడిమిడి జ్ఞానంతో అద్వైతుల అమనస్కయోగానికీ అచల సిద్ధాంతానికీ మాటల్లో తప్ప భేదమేమీ లేదని వ్రాసినాను. అనంతపురం వాస్తవ్యులు గొప్ప వేదాంత పండితులు డా॥ రత్నాకరం బాలరాజుగారు అచలానికి అద్వైతానికి పొంతన లేదని ఈ రెండు మతాలకున్న భేదం వివరిస్తూ సుదీర్ఘంగా జాబు వ్రాసినారు. అచలం నింద్యమని కూడా వ్రాసినారు. మజ్జిబోయిన రామ సుబ్బయ్యగారు (52/79 కోటవీధి కర్నూలు) తమ బ్రహ్మజిజ్ఞాస చతుర్థభాగంలో అచలమతాన్ని పైన పేర్కొన్న మూడు మంత్రాలను అచలమతంలోని మితవాదుల, అతివాదుల అభిప్రాయాలను ఈ యిరువురికీ ఉపాదేయమైన శివరామ దీక్షితీయ గ్రంథాన్ని చాలా తీవ్రంగా విమర్శిస్తూ ఖండించినారు. "యోగ వాసిష్ఠంలోని 40శాతం, తక్కిన 60శాతం బౌద్ధ చార్వాకాది మతములలో తమ అభిప్రాయం కలిపి కలగూర గంపగా జేసినదే బృహద్వాసిష్ఠ"మని తీర్మానించినారు. (పుట. 538).

అచలమతం గురించి సంగ్రహంగా తెలుపవలసిందని అచల గురుమందిరం (11-1-134-140 సీతాఫల్‌మండి సికింద్రాబాదు 500 061) అధ్యక్షులు ఉప్పలంచి కృష్ణమూర్తి గారిని కోరినాను. ఆయన నాకీవిధంగా వ్రాసినాడు.

"అచల సిద్ధాంతమునకు బృహద్వాసిష్ఠమను శివరామ దీక్షితీయములో ద్వాదశాక్షరి మంత్రము ముఖ్యమైన ఆధారము. దీనికి నిర్వికారమైన బట్టబయలు లక్ష్యస్థానము. దీని నిర్ధారణకొరకే శుద్ధనిర్గుణతత్త్వ కందార్థదరువులు, పరతత్త్వ కందములు శివరామ దీక్షితీయము, పరిపూర్ణబోధ, సిద్ధాంతశిరోమణి గ్రంథములు ప్రామాణికమైనవి.

అద్వైతమునకు అచలమునకు గల భేదనిర్ణయము :- జీవాత్మ పరమాత్మల యొక్క ఐక్యత అద్వైతము యొక్క అంతిమ లక్ష్యము. పరమాత్మ సృష్టికి కారణమని, కర్త భోక్త సర్వము తానే అని నిర్ణయించినది. ప్రారంభమున దేహి దేహముల విభాగముతో వివరణ ప్రారంభించి అంతిమముగా శుద్ధ చైతన్యమొక్కటే సత్యమని ప్రకటించినది. "బ్రహ్మ సత్యం జగన్మిథ్యా" అను సూత్రము దీని ఆధారముననే వెలువడినది.

అచలవాదుల భావన :- జగత్తునకు కారణమైన బ్రహ్మమునకు వికారము లేదనుట అసత్యము. సర్వజగత్తునందు వికారము పరిణామము సహజసిద్ధము. అటువంటప్పుడు జగత్కారణమైనదానికి వికారము లేదనుట వాస్తవము కాదు. మూలమున లేని వికారము అంతిమములో ఉండకూడదు. బీజమున లేని లక్షణము వృక్షమున ఉండగూడదు. ఈ వికారవాదమును తప్పించుకోవడమునకు జగత్ అసత్యమని చెప్పి నంత మాత్రమున బ్రహ్మము శుద్ధము కానేరదు. ప్రకృతిపురుషులు రెండూ ఒకటే. ప్రకృతిలో ఉన్న వికారములు పురుషునిలో లేవనడము అంగీకృతము కాదు. జీవునికి తోచే వికారము మాయాలక్షణమని చెప్పుట అచలవాదు లంగీకరించరు. ఉన్నదున్నట్లు చెప్పుట అచలవాదుల విధానము. అద్వైతులు చెప్పే శుద్ధచైతన్యబ్రహ్మమును అచల వాదులు సత్యమైనదిగా శుద్ధమైనదిగా అంగీకరించరు. ఈ చైతన్యమునకు అతీతముగా చావు పుట్టుకలు లేనిదిగా సర్వకాల సర్వావస్థలయందు సత్యమైనదిగా బట్టబయలై యున్నదేదో దానినే పరిపూర్ణమని అచలమని వ్యవహరింతురు. ఇదే వీరి అంతిమ లక్ష్యసిద్ధాంతము. వికారయుతమైన యెరుకను విడిపించి అచలపరిపూర్ణ ప్రబోధచేత జననమరణభ్రాంతి రహితము చేయుట ఈ సంప్రదాయము ప్రధాన ఉద్దేశము. ఈ సంప్రదాయ మూలసూత్రము తెలియక కొందరు ద్వాదశి మంత్రమును శివరామదీక్షితీ యములో చెప్పిన కేవలాత్మ పదమును బట్టి అది ఆత్మలోని ఒక అంతిమ శుద్ధమైన భాగముగా, శుద్ధ చైతన్యముగా చెప్పుతున్నారు. అది సరైన నిర్ణయము కాదు. బట్ట బయలనే పదమునకు శుద్ధ ఆకాశమని, అర్థము చెప్పి పంచాకాశములలోని పద్ధతికి దిగి చివరి మహాకాశ లేక పరాకాశమునే పరిపూర్ణమని సంబోధిస్తున్నారు. ఆకాశము బయలు కాదని శుద్ధనిర్గుణతత్త్వ కందార్థ గ్రంథకర్త శ్రీ భాగవతుల కృష్ణదేశికులు - కం॥ బయ లాకసమని కొందరు, భయపెట్టెద రందువలన భయపడకు సుమీ బయలందు శబ్దమున్నను,

బయలాకసమనుచు నమ్మబడని నీచాతా, శబ్దము లేదా భ్రమ యెందుచాతా, ఎరుగ కాకాశమే పరిపూర్ణమని కొందరు బల్కి రిదివిని గురిదప్పి యుండేవు అని అన్నారు.

జీవబ్రహ్మైక్యమును అద్వైతులంగీకరింతురు. అచలు లంగీకరించరు. జీవ బ్రహ్మలే జననమరణములకు కార్యకారణ రూపములని అచలుల నిర్ణయం. అద్వైతులు 'ఆకాశం గగనం శూన్యమ్'' అంటూ 'ఆకాశ అవకాశస్య - ఆకాశం వ్యాపితం జగత్, ఆకాశస్య గుణశబ్దో, నిశ్శబ్దో బ్రహ్మముచ్యతే' అన్నారు. దానిని అచలులు 'ఆకాశం శూన్యంబని లోకులు మొర బెట్టి దానిలో పవనాదులు బుట్టినవని చీకాకుగ చెప్పినారు, ఛీ వినరాదూ - వంధ్యాసంతు యీ క్షితిలోనె లేదూ' అని ఖండించినారు. అద్వైతులు దక్షిణామూర్తి సూచించిన మౌనసంజ్ఞను అనగా నిశ్శబ్దమును బ్రహ్మముగా భావించి దానినే 'నిశ్శబ్దో బ్రహ్మముచ్యతే' అన్నారు. శబ్దము నిశ్శబ్దమునుండి పుట్టినపుడు కార్యకారణములకు భేదము ఎట్లు కుదురును? అందువలన అచలవాదులు శబ్దమునకు నిశ్శబ్దమునకు అతీతమైన అర్థమునే స్థిరపరచి పరిపూర్ణభావమును ప్రకటించి గురుశిష్య న్యాయపరంగా భ్రాంతిరహిత అచలపరిపూర్ణప్రబోధతో సంప్రదాయమును ఏర్పరచుకొన్నారు'' -

సామాన్యజనానికి యోగం కష్టసాధ్యం. భక్తి కర్మ జ్ఞాన మార్గాలు సులభం. అందు వలననే శివరామ దీక్షితులు యోగమార్గాన్ని కాదన్నారు కాని స్వయంగా శివరామ దీక్షితులు ఆయన అనుయాయుల్లో చాలామంది గొప్ప భక్తులు యోగులు, తపస్సంపన్నులు సిద్ధ పురుషులు ఉన్నారు. వారు ఎక్కువగా పాతంజలయోగాన్ని అనుష్ఠించినవారే. స్త్రీలకు పామరులకు అన్ని వర్ణాలవారికి సులభమోక్షమార్గం చూపినది అచలమతం. అన్ని మతా లలో వలె అచలమతంలోను కాలాంతరాన అనర్హులైన గురువుల మూలంగా కొన్ని బలహీనతలేర్పడినవి. స్వానుభవం లేకుండా పుస్తకాల్లోని మాటలు వల్లెవేసి సామాన్య జనాన్ని ఏమార్చే కొందరి మూలంగా అచలమతానికి కళంకం ఆపాదించరాదు. అచల మార్గానుయాయి ప్రకాశంజిల్లా ఎఱ్ఱగొండపాలెం నరసింహదాసు రచించిన శివరామదీక్షిత చూర్ణికలోను, భద్రాద్రి రామశతకంలోను, శివానందస్వామివారి పరిపూర్ణబోధ సిద్ధాంత శిరోమణిలోను ప్రపంచింపబడిన యోగవిశేషాలు మేడపాటి వెంకటరెడ్డిగారు ఉదాహ రించినారు. చదువు సంధ్యలు లేని అట్టడుగు వర్గాలలో ఆస్తిక్యబుద్ధిని భక్తివేదాంతాలను

పాదుకొల్పి భారతీయసంస్కృతికి అచలమతం గొప్పసేవ చేసిందనటానికి సుప్రసిద్ధ దేశ భక్తులు ఉన్నవ లక్ష్మీనారాయణ గారు (1873-1958) రచించిన మాలపల్లి నవల సాక్ష్యం.

శ్రీధరులు శివరామ దీక్షితులకు చేసిన బోధ అచలసారమీ పద్యం

సీ॥ స్వప్నంబునంగాంచు సకలచేతనములు నెందుండి యేతెంచె నెందు జనియె
నట్టులే పరిపూర్ణమందున మాయాప్రపంచంబు జన్మించి ప్రబలు నడగు
కులవర్ణనామముల్ గలుగవు కదలదు జగతి పుట్టిపెరిగి చచ్చుచుండు
టెరుగుదు నిర్గుణ పరిపూర్ణమది గాంచినట్టిడు కామాదులంట డెలమి

తే॥గీ॥ నతడె బ్రహ్మంబు నిస్సంగుడతడె నిర్వికారుడతడె యాతడె నిరాకారు డతడె
సచ్చిదానందమయ మూర్తి సత్యమనుచు, బోధ గావించి యంతట శ్రీధరుండు.
(జ్ఞానానుతర్షణాన్వేషణము - 121)

శివరామ దీక్షితుల శిష్యుడు కంబాలూరి అప్పమంత్రి ఆయన శిష్యులు పరశురామ నరసింహదాసు, పరశురామ సీతారామస్వామి, పరశురామ సూరయ్య ముగ్గురన్నదమ్ములు. వీరి ఆడ తోబుట్టువులు శేషమాంబ, నాగమాంబలు. వీరిలో పెద్దవారైన నరసింహదాసు భద్రాద్రి రామశతకము, పరశురామ సీతారామశతకము, తిరుమల దత్తశతకము, శివరామదీక్షిత చూర్ణికలు రచించినారు. ఆ చూర్ణికలో నాల్గు అంశము లుట్టంకించి ఈ వ్యాసం ముగిస్తాను.

శ్రీమద్గురు కరుణా కటాక్ష వీక్షణ విచక్షణ సంపూర్ణ, ఋగ్యజుస్సామాధర్వణ। తర్కవ్యాకరణ మీమాంస భాట్ట ప్రభాకర। వేదవేదాంత శాస్త్రాగమ। అష్టాదశ పురాణేతిహాస పరిశీలనం। శిష్యజన పరిపాలనం ॥ ౧ ॥

నిత్యానిత్య వస్తువివేక । ఇహాముత్రార్థ ఫలభోగ విరాగ । శమ దమ శాంతి తితిక్షా శ్రద్ధోపరతి । ముముక్షుత్వ । స్వస్తికారోహణ స్పర్శ త్రివిధ దీక్షాపరం । భక్తజన వశీకరం ॥౨॥

యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధ్యానధారణ సమాధ్యష్టాంగ యోగ। మంత్ర లయ హఠ రాజయోగ । నిష్ఠాగరిష్ఠాత్మధ్యాన రాధాయంత్ర షణ్ముఖీ

శాంభవీ ఖేచరీ ముద్రాభ్యాస, ఆధార స్వాధిష్ఠాన మణిపూరకానాహత విశుద్ధాజ్ఞేయ సహస్రారచక్ర పరిశోధకం। ఆత్మ బోధకం ॥3॥

తత్త్వమస్యాది మహావాక్యార్థ లక్ష్యార్థ బ్రహ్మైక్యానుసంధాన నాదబిందు కళాతీత అద్వయ అవాచ్య అచింత్య అవ్యయ నిత్యశుద్ధ బుద్ధ ప్రజ్ఞానఘన నిర్వికల్ప నిర్వచన నిర్వికార నిశ్శబ్ద నిరతిశయ నిరుపమాన నిర్మల నిర్గుణ నిరవయవ నీరంధ్ర నిర్విశేష నిరుపద్రవ నిషిద్ధ నిష్కర్మ నిష్కళంక, నిష్ప్రపంచ నిరంజన నిరాభాస సర్వవికారశూన్య సహజామనస్క రాజయోగ సమాధ్యధ్యక్ష। శ్రీ శివరామ దీక్ష ॥ ౪ ॥

ఆధారాలు :

1. జ్ఞానానుతర్షణాన్వేషణము - కొప్పరపు గోపాలకృష్ణమూర్తి అవధాని 1936 ఉయ్యందన తాళ్ళూరు - కోసూరు మండలం - గుంటూరు జిల్లా.
2. బృహద్వాశిష్ఠము - రామడుగు శివరామ దీక్షితులు - ప్రకాశకులు పూర్ణానంద రాజయోగాశ్రమం - కర్నూలు - 1988
3. బ్రహ్మజిజ్ఞాస - చతుర్థభాగము - మత్తిబోయిన రామసుబ్బయ్య 52/79 కోట వీధి - కర్నూలు - 1980.
4. తెలుగు యోగులు - మేడపాటి వెంకటరెడ్డి - 1987.